సాక్షి కర్నూలు

బుధవారం । 23 । ఆగస్టు । 2023



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి మంగళవారం కేసీ కాల్వకు 159 క్యూ సెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



అతివేగానికి ఇద్దరు బలి

మంత్రాలయం సమీపంలో మంగళవారం సాయంత్రం బైక్ అదుపు తప్పి ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతుల్లో కోసిగి కానిస్టేబుల్, ఆటో డ్రైవర్ ఉన్నారు.

- IIలో

న్యూస్‌రీల్

దినసరి కూలీలకు రూ.19.80 లక్షలు విడుదల

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఏపీ ప్రభుత్వ గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో దినసరి వేతనంపై పనిచేస్తున్న కమాటీ, కుక్, వాచ్‌మెన్లకు 10 నెలల వేతనాలు రూ.19.80 లక్షలు విడుదలైనట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.4,500 ప్రకారం ప్రభుత్వం వేతనాలను చెల్లిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలకు సంబంధించి 2022 జూన్ నెల నుంచి 2023 మార్చి నెల వరకు(10 నెలలు) వేతనాలు విడుదలయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశాలు మేరకు ఆయా విద్యా సంస్థల్లో మంజూరైన పోస్టుల్లో పనిచేస్తున్న 44 మంది బ్యాంకు ఖాతాలకు రెండు, మూడు రోజుల్లో ఈ వేతనాలను జమ చేస్తామన్నారు.

శిశు సంరక్షణ విభాగానికి రూ.70లక్షలు మంజూరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూ(శిశు సంరక్షణ విభాగం)కు రాష్ట్ర ప్రభుత్వం రూ.70 లక్షలు నిధులు మంజూరు చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఈ నిధుల ద్వారా ప్రస్తుతం చిన్నపిల్లల విభాగం భవనంలో కింద ఉన్న ఎస్ఎన్‌సీయూను 20 పడకలతో మూడో అంతస్తుకు మార్చనున్నారు. అక్కడే ఎన్‌బీసీయూకు 20 పడకలు, పీఐసీయూకు 20 పడకలతో విభాగాలను ఆధునీకరించనున్నారు. ఆయా విభాగాల్లో ఏసీలు, ఆక్సీజన్ సరఫరా, సక్షన్ ఆపరేటర్లు తదితర పరికరాలను సమకూర్చి చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మూడో అంతస్తులో ఉన్న ఎన్ఆర్‌సీ విభాగానికి కిందకు మార్చడంతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు, గర్భిణులు, చిన్నారులు సేదతీరేందుకు వసతి కల్పించనున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

- కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ విజయ మనోహరి

పత్తికొండటౌన్: సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపడతామని కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. మంగళవారం పత్తికొండ పట్టణంలో ఆదోని డివిజన్ పరిధిలోని సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేడీసీసీబీ స్థలాల్లో మల్టీ సర్వీస్ సెంటర్ల కింద షాపింగ్ కాంప్లెక్స్‌లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. వాటిని పరిశీలించి, నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. అంతకు ముందు కేడీసీసీబీ చైర్ పర్సన్‌ను సింగిల్‌విండో చైర్మన్లు, సిబ్బంది పూలమాలల వేసి ఘనంగా సన్మానించారు. సమావేశంలో కేడీసీసీబీ జిల్లా సీఈఓ పి.రామాంజినేయులు, డీసీఓ ఎస్.రామాంజినేయులు, డీజీఎంలు రామ్‌మోహన్, నాగిరెడ్డి, డీపీడీఎం నహీదా సుల్తానా, డీఆర్ నాగలింగేశ్వరదేవి, జీఎం శివలీల పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తూ.. శాస్త్రీయత పెంచుతూ!

రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగమైన పాడిపరిశ్రమను మరింత వృద్ధి పరిచేందుకు కృషి చేస్తోంది. పశు విజ్ఞాన బడుల పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పశు పెంపకందారులు శాస్త్రీయ పద్ధతులు అవలంభించేలా అవగాహన కల్పిస్తోంది. దూడల మరణాలు తగ్గించడం, పాల ఉత్పత్తి పెంచడం, జీవాలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలపై ప్రతి వారం ఆర్బీకేల్లో చర్చించి పశుపోషణలో రాణించేలా అధికారులు చర్యలు చేపట్టారు.



పశువిజ్ఞాన బడిలో భాగంగా పశువులకు చికిత్స చేస్తున్న దృశ్యం

పకడ్బందీగా 'పశువిజ్ఞాన బడి'

- అన్ని మండలాల్లో ప్రతి వారం నిర్వహణ
- పశుపోషణ, పాడి అభివృద్ధి, జీవాల పెంపకంపై విజ్ఞానం
- శాస్త్రీయంగా రాణించేందుకు పెంపకందారుల ఆసక్తి
- 877 ఆర్‌బీకేల పరిధిలో ప్రతి నెల 600 పైగా బడులు
- పర్యవేక్షణకు ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి

కర్నూలు(అగ్రికల్చర్): పశుపోషణ, పాల ఉత్పత్తిని పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందుకోసం ప్రతి వారం పశువిజ్ఞాన బడులను నిర్వహిస్తోంది. పశుసంవర్ధక శాఖ 2022–23 నుంచి వినూత్నంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తూ విజ్ఞానాన్ని పెంచుతోంది. అన్నదాతలకు వ్యవసాయం ఎంత ముఖ్యమో.. పాడి కూడా అంతే ప్రధానం. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ఈ కార్యక్రమం పాడి పరిశ్రమలో రాణిస్తున్న వారికి.. జీవాలు, కోళ్ల పెంపకందారులకు ఎంతో ఉపయోగపడుతోంది. వ్యవసాయ శాఖ పొలంబడి, ఉద్యానశాఖ తోటబడి



డోన్ మండలంలో పశువిజ్ఞానబడి నిర్వహిస్తున్న సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు

పేరుతో రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పిస్తోంది. అదే తరహాలోనే పశుసంవర్ధకశాఖ పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. కర్నూలు జిల్లాలో 66 పశువైద్యశాలలు(వెటర్నరీ డిస్పెన్సరీలు), 11 ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 15 ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్, 68 పశువైద్యశాలలు ఉన్నాయి. వీఏఎస్‌లు ప్రతి వెటర్నరీ అసిస్టెంటు సర్జన్(పశువైద్యుడు), సహాయ సంచాలకులు పశు విజ్ఞానబడి నిర్వహించాల్సి ఉంది. పశువిజ్ఞాన బడికి అవసరమైన పాడిపరిశ్రమ నిర్వాహకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, కోళ్ల పెంపకందారులు తదితరులను 20 మందిని గ్రామ పశుసంవర్ధక సహాయకులు (వీఏహెచ్ఏ) సిద్ధం చేస్తారు. పశువైద్యులు, సహాయ సంచాలకులు తమ పరిధిలో ఏదో ఒక ఆర్‌బీకేలో పశువిజ్ఞాన బడిని నిర్వహిస్తారు.

ప్రతి నెల 600 పైగా పశువిజ్ఞాన బడులు

కర్నూలు జిల్లాలో 60 మంది పశువైద్యులు, 11 మంది సహాయ సంచాలకులు పని చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 68 మంది పశువైద్యులు, 15 సహాయ సంచాలకులు పనిచేస్తున్నారు. వీరు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పశువిజ్ఞాన బడులను నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా వీరు నాలుగు పశువిజ్ఞాన బడులు విధిగా నిర్వహించాల్సి ఉంది. సహాయ సంచాలకులు, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్స్ మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 154 మంది ప్రతి నెల 600పైగా పశువిజ్ఞాన బడులను నిర్వహిస్తుండటం విశేషం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 లక్షల వరకు పశుసంపద ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కో పశువిజ్ఞాన బడి ద్వారా 20 మందికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.4.92 లక్షలు ఖర్చు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 877 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఉన్నాయి. ఏడీలు, పశువైద్యులు తన పరిధిలోని ఆర్‌బీకేల్లో వారం వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి

పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌లో పని చేస్తున్న జాయింట్ డైరెక్టర్ లావణ్యలక్ష్మిని ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించింది. ఇటీవల ప్రత్యేక అధికారి రెండు జిల్లాల్లోను పర్యటించి పశు విజ్ఞానబడుల నిర్వహణను పరిశీలించారు.

అవగాహన కల్పిస్తున్న అంశాలు ఇవే..

- ప్రస్తుతం పది శాతం వరకు దూడల మరణాలు ఉన్నాయి. వీటిని జోరుకు తగ్గించాలనేది లక్ష్యం.
- పరిశుభ్రమైన పాల ఉత్పత్తి. పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించడం. పాడి పశువులకు దాణామృతం(టీఎంఆర్), సమీకృత దాణ అవసరాన్ని తెలియజేయడం. దేశీయ ఆవుల పెంపకం, ఏ2 పాల ఉత్పత్తి అంశాలపై అవగాహన.
- గొడ్డుబోతు సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి.
- పాడిపశువుల్లో ఏడాదికి ఒక ఈత ఉండాలి. అప్పుడే పాడిపరిశ్రమలో రాణించే అవకాశం ఉంది. దీనిని పశువిజ్ఞాన బడిలో ప్రధానంగా చర్చిస్తారు.
- గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతులకు అనుగుణంగా పెంచడం.

అంతేగాక జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్లు పర్యవేక్షిస్తారు. ఇందులో ఏఏ అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలనే అంశాలపై(టాపిక్‌లు) కూడా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సూచనలు చేశారు. ఈ ప్రకారం రైతులకు పశువిజ్ఞాన బడి ద్వారా ప్రధానమైన అంశాలపై అవగాహన కల్పిస్తుండటం విశేషం.

పొట్టేళ్ల పెంపకంలో రాణిస్తున్నాం



పశువిజ్ఞాన బడి వల్ల పొట్టేళ్ల పెంపకం లాభసాటిగా నడుస్తోంది. దాదాపు రెండు సంవత్సరాలుగా ఇందులో రాణిస్తున్నా. ఏడాది పొడవునా పెంపకం ఉంటోంది. ప్రస్తుతం 40 పొట్టేళ్లు ఉన్నాయి. వీటితో పాటు వ్యవసాయం చేస్తున్నాం. గతంలో పశువైద్యుల సేవలు పొందడం చాలా కష్టం. నేడు పశువిజ్ఞాన బడి ద్వారా పశువైద్యులు మా గ్రామానికే వచ్చి సేవలందిస్తున్నారు.

– చిన్నరాముడు, బస్తిపాడు, కల్లూరు మండలం

పాడిపరిశ్రమపై అవగాహన పెరుగుతోంది



ప్రస్తుతం 8 బర్రెలతో పాడిని అభివృద్ధి చేసుకుంటున్నా. గతంలో పాడి పశువుల పెంపకంపై పూర్తిగా అవగాహన లేక కొంతమేర నష్టం వచ్చింది. పశు విజ్ఞాన బడి ద్వారా పశువైద్యులు అవగాహన కల్పించడం ఎంతగానో ఉపయోగపడుతోంది. పోషకాహారం, పునరుత్పత్తి నిర్వహణకు శాస్త్రీయంగా సలహాలు అందించడం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో మేలు.

– వీరాంజనేయులు, హుసేనాపురం, ప్యాపిలి మండలం, నంద్యాల జిల్లా

పకడ్బందీగా పశు విజ్ఞాన బడులు



పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. జిల్లాలో 66 మంది వీఏఎస్‌లు, 11 మంది సహాయ సంచాలకులు పనిచేస్తున్నారు. వీరు ప్రతి వారం ఆర్‌బీకే స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. పశు సంరక్షక్ యాప్‌లో వారం వారం ఫొటోలు, హాజరైన రైతుల పేర్లు, వారి మొబైల్ నెంబర్లు అప్‌లోడ్ చేయిస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి షెడ్యూలు ప్రకారం విజ్ఞాన బడులు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ రామచంద్రయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

భ్రూణహత్యలపై చర్యలకు ఉమ్మడి కార్యాచరణ

- సరిహద్దు జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారుల తీర్మానం

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు అరికట్టేందుకు ఉమ్మడి కార్యాచరణతో పనిచేయాలని సరిహద్దు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తీర్మానించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని కౌన్సిల్ హాలులో పీసీ పీఎన్‌డీటీ చట్టం అమలుపై అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల(కర్నూలు, జోగులాంబ గద్వాల,బళ్లారి, రాయచూరు) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల శాతం తగ్గడం వల్ల సంభవించే దుష్పరిణా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

మాలపై చర్చించారు. ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు కర్నూలు జిల్లాలో అమలుపరుస్తున్న కార్యాచరణ ప్రణాళికలు, శిక్షణ, అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం గద్వాల జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ శశికళ, రాయచూరు తాలూకా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ షాకీర్, బళ్లారి తాలూకా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఈరన్న వారి బృంద సభ్యులతో కలిసి ఆయా జిల్లాల్లో పీసీ పీఎన్‌డీటీ చట్టం అమలు తీరు గురించి వివరించారు. ఉమ్మడి సహకారంతో స్కానింగ్ సెంటర్ల తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి ఒకచోట నుంచి మరో చోటకు వెళ్లి స్కానింగ్ పరీక్షలు, గర్భస్రావాలు చేయించుకున్న వారి వివరాలు సేకరించి ఉమ్మడిగా కలిసి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో పీసీ పీఎన్‌డీటీ చట్టం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ బాలమద్దయ్య, డీఎల్ఏటీవో డాక్టర్ భాస్కర్, డీపీఎంవో డాక్టర్ ఉమా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రఘురామిరెడ్డి, డెమో ప్రమీలాదేవి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కళా వెంకటరమణ, దిశ ఎస్ఐ మమత, హెచ్ఈఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సోలార్, విండ్ ప్రాజెక్టులకు శంకుస్థాపన

- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

పాణ్యం/అవుకు/ బేతంచెర్ల: నంద్యాల జిల్లా పరిధిలో అవుకు, పాణ్యం, బేతంచెర్ల,డోన్ మండలాల్లో ఏర్పాటు చేసే సోలార్, విండ్ ప్రాజెక్టులకు నేడు శంకుస్థాపన చేయనున్నారు. అవుకు మండలంలో జూనూతల, ఉప్పలపాడు, కొండమనాయునిపల్లి గ్రామాల్లో గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 2300 మెగా వాట్ల సోలార్ పవర్‌ప్రాజెక్టు, పాణ్యం మండలం కందికాయపల్లె గ్రామంలో ఏఎంగ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 700 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, 300 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు, బేతంచెర్ల మండలం ముద్దవరం, డోన్ మండల కేంద్రంలో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 1000 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, 1000 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టులకు బుధవారం ఉదయం 11 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మంగళవారం నంద్యాల జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి కందికాయపల్లె, ముద్దవరంలో ఏర్పాట్లను పరిశీలించారు.



కందికాయపల్లెలో శంకుస్థాపన స్థల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

హౌసింగ్ పీడీగా సిద్దలింగమూర్తి?



కర్నూలు(అర్బన్): జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా డ్వామా విజిలెన్స్ అధికారి సిద్దలింగమూర్తికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఆమె జిల్లాలోని మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓ, హౌసింగ్, పీఆర్ ఇంజనీర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్టేజ్ కన్వర్షన్‌లో జీరో పురోగతి నమోదు చేసిన వెల్దుర్తి, నందవరం, చిప్పగిరి, ఆదోని రూరల్, ఆదోని అర్బన్, కర్నూలు, క్రిష్ణగిరి మండలాలకు చెందిన హౌసింగ్ ఏఈలపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే హౌసింగ్‌లో పురోగతి అంతంతమాత్రంగా ఉండడం, ఇతరత్రా కారణాల వల్ల పీడీగా విధులు నిర్వహిస్తున్న వెంకటనారాయణను సరెండర్ చేసి, ఆయన స్థానంలో సిద్దలింగమూర్తికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ. 2.35 కోట్లు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ కానుకల లెక్కింపు ప్రారంభమైంది. శ్రీమఠం గురురాజాంగణ భవనంలో మంగళవారం శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో లెక్కింపును చేపట్టారు. ఆగస్టు నెలలో 22 రోజులకుగాను రూ.2, 35,62,719 సమకూరింది. ఇంకా నాణేలు, బంగారు, వెం డి కానుకలు లెక్కించాల్సి ఉన్నట్లు మేనేజర్ వివరించారు.



హుండీ కానుకలు లెక్కిస్తున్న సేవా భక్తులు

కాలుష్య నియంత్రణ ప్రధానం

- విస్మరిస్తే ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- చిన్న పరిశ్రమలకు అనుమతులు త్వరగా ఇవ్వాలి
- తుంగభద్ర, కుందు పరివాహక ప్రాంతాల్లో నీరు, భూమి కలుషితంపై విచారణ
- జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకే టీడీపీ విమర్శలు
- హరిత భవన్ ప్రారంభోత్సవంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన, చిత్రంలో ఎంపీలు సంజీవకుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యేలు కాటసాని, హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, జిల్లా కలెక్టర్ సృజన తదితరులు

కర్నూలు(సెంట్రల్): దేశం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు ఎంత అవసరమో వాటి నుంచి వచ్చే కాలుష్యాన్ని నియంత్రించడం కూడా అంతే ప్రధానమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఒక వేళ కాలుష్యాన్ని నియంత్రించకపోతే సమాజం అవిటిది అవుతుందని, జరిగిన అభివృద్ధి శూన్యమవుతుందని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చిన్న పరిశ్రమలకు త్వరగా అనుమతులు ఇవ్వాలన్నారు. మంగళవారం నగరంలోని వెంకటరమణ కాలనీలో రూ.17 కోట్లతో నిర్మించిన కాలుష్య నియంత్రణ మండలికి చెందిన హరిత భవన్‌ను ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనంలో మొదటి రెండు ఫ్లోర్లలో జోనల్, మూడో ఫ్లోర్‌లో రీజినల్ కార్యాలయాలు, నాలుగు, ఐదో అంతస్తుల్లో డాక్టర్ వైఎస్ఆర్ ల్యాబోరేటరీని ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కార్యాలయాల ప్రారంభానికి ముందుగా శాస్త్రోక్తంగా పూజలు చేసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. అయితే పరిశ్రమల యజమానులు నిబంధనల మేరకు కాలుష్యాన్ని నియంత్రించకపోతే సమీపంలోని ప్రజలు అనారోగ్యం పాలు కావాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటించని, కాలుష్యాన్ని నియంత్రించని పరిశ్రమలను అవసరమైతే మూసివేసేందుకైనా వెనుకాడకూడదన్నారు. కాగా, కర్నూలు పారిశ్రామిక ప్రగతి వైపు నడిపించేందుకు ఓర్వకల్ ఇండస్ట్రీయల్ హబ్‌ను 9800 ఎకరాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ పరిశ్రమలకు నీటి వసతి కల్పించేందుకు రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిలో ఓర్వకల్ ఇండస్ట్రీయల్ హబ్‌ను నోడ్ పాయింట్‌గా గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

నది పరివాహక ప్రాంతాల కలుషితంపై విచారణ చేయండి

అంతకుముందు సమావేశంలో తుంగభద్ర, కుందు పరివాహక ప్రాంతాలు సమీపంలోని పరిశ్రమలతో నీరు, భూమి కలుషితమైందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చెప్పడంతో మంత్రి స్పందించారు. గతంలోనే తుంగభద్ర కలుషితానికి కర్నూలు నగర మునిసిపల్ కమిషనర్, కుందూ కలుషితానికి నంద్యాల మునిసిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో కారణాలు అన్వేషించేందుకు కమిటీలు ఏర్పాటు చేశారని, వాటి నివేదికలు తెప్పించుకొని తగిన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు మంత్రి ఆదేశించారు.

ప్రతిపక్షాలకు అభివృద్ధి కనిపించడంలేదా ?

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చిత్తశుద్ధితో సంక్షేమం, అభివృద్ధి పనులను చేపడుతుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం అర్థరహితమని మంత్రి బుగ్గన అన్నారు. కర్నూలు జిల్లాలో గతంలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి జరిగిందని, తమ వెంట వస్తే చూపిస్తామని చెప్పారు.

- కర్నూలు నగరంలోని మురుగు నీరు తుంగభద్రలో కలవకుండా రూ.124 కోట్లతో సీవేజ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ పనులు మొదలు కానున్నట్లు వెల్లడించారు.
- సుంకేసుల నుంచి కర్నూలుకు తాగునీటి పైప్ లైన్ ఏర్పాటుకు రూ.80 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.
- కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కల్లూరు వార్డుల కోసం రూ.105 కోట్లతో అదనపు ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.
- తుంగభద్ర పుష్కరాల సమయంలో రూ.250 కోట్లతో రహదారులు నిర్మించామన్నారు.
- రూ.135 కోట్లతో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ నూతన భవన నిర్మాణాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఈ నిర్మాణాలు పూర్తి అయితే రాష్ట్రంలోనే ఈ కాలేజీ నంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు.
- సంగమేశ్వరం–నంద్యాల జాతీయ రహదారి కోసం రూ.700 కోట్లు, నంద్యాల–కోయిలకుంట్ల రహదారి కోసం రూ.600 కోట్లు, కర్నూలు–గార్గేయపురం జాతీయ రహదారి కోసం రూ.100 కోట్లు, ఆదోనిలో బైపాస్ రోడ్డు కోసం రూ. 200 కోట్లను కేటాయించామన్నారు.
- కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ శ్రీధర్, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కాలుష్య నియంత్రణ మండలి జోనల్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరు ఎంపీ రావు, రీజినల్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు బీవై ముని ప్రసాదు, ఐలా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆల్కాలిస్ ఫ్యాక్టరీతో పది గ్రామాల్లో నీరు విషమైంది

నగరానికి సమీపంలోని ఆల్కాలీస్ ఫ్యాక్టరీతో పక్కనున్న పది గ్రామాల్లో నీరు కలుషితమైంది. అక్కడి ప్రజలు విచిత్రమైన వ్యాధులతో బాధపడుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారంపై పార్లమెంట్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశాను. 2019 ఎన్నికల సమయంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తమకు ఏమి అక్కరలేదని, కేవలం నీరు కలుషితం కాకుండా చూడాలని నన్ను కోరారు.

-కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కుందూ కూడా కలుషితమైంది

తుంగభద్రతోపాటు కుందూ నది కూడా సమీపంలోని పరిశ్రమలతో కలుషితమైంది. తుంగభద్ర, కుందూ పరివాహక ప్రాంతాల్లో కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రజలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు

తుంగభద్ర ఒడ్డున ఆల్కాలీస్ ఫ్యాక్టరీ ఉండడంతో తాగు, సాగు నీరు కలుషితమైంది. ఆ ఫ్యాక్టరీకి సంబంధించి విష వాయువులు గాలిలో కలిసిపోవడంతో సమీపంలోని ప్రజలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయితే, ఆ ఫ్యాక్టరీపై ఎవరూ మాట్లాడిన దాడులు చేస్తారు. పరిశ్రమల వ్యతిరేకి అంటారు. కాలుష్యాన్ని నియంత్రించాలని చెబితే పరిశ్రమలను వ్యతిరేకించడం ఎలా అవుతుంది.

– కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కాలుష్య నియంత్రణకు చర్యలు

కర్నూలు నగరంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలో కర్నూలు రెండో స్థానంలో నిలిచింది. ఈసారి మొదటిస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో 70 వేల మొక్కలు నాటుతున్నాం.

– నగర మేయర్ బీవై రామయ్య

క్లుప్తంగా

టీబీ డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం

● డ్యాంలో 83 టీఎంసీల నీరు



తుంగభద్ర రిజర్వాయర్

హొళగుంద: తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. ప్రస్తుత పరిస్థితితో దిగు వ కాలువ(ఎల్లెల్సీ) ఆయకట్టు రైతులు ఖరీఫ్ నుంచి గట్టెక్కినా, రబీ సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నా యి. మంగళవారం డ్యాంలో 105.788 టీఎంసీలకు 83.425 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటి మట్టం 1,633 అడుగులకు 1627.06 అడుగులుగా నమోదైంది. ఇన్‌ఫ్లో 1,085 క్యూసెక్కులు ఉండగా, వివిధ కాలువలకు ఔట్‌ఫ్లో రూపంలో 10,325 క్యూసె క్కుల నీరు వెళ్తోంది. దిగువ కాలువకు విడుదలవుతున్న నీరు ఆంధ్రా సరిహద్దు 250 కి.మీ వద్ద 471 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది డ్యాంలో 1,633 అడుగులతో 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటిమట్టం ఉండగా.. 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో గేట్లు తెరవడం గమనార్హం.

శ్రీశైలం నుంచి 28వేల క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి సోమవారం నుంచి మంగళవారం వరకు దిగువ ప్రాంతాలకు 28,607 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 8.908 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 17,032 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 8వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,025 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి 490 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మంగళవారం సాయంత్రానికి జలాశయంలో 99.9810 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 858 అడుగులకు చేరుకుంది.

కొండ చిలువ కలకలం



చనిపోయిన కొండచిలువ

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో మంగళవారం కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామ శివారుల్లోని చెరువుగట్టు సమీపంలోని ఓ పాడుబడిన పాఠశాల భవనం వెనుక ఉన్న వెదురు తడికెల కొట్టంలో నుంచి ఆరు అడుగుల కొండచిలువ రోడ్డుపైకి వచ్చింది. గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామంలోకి వస్తుండటంతో కొందరు వ్యక్తులు కట్టెలతో కొట్టి చంపేశారు.

మూలరామో విజయతే!

మధ్వమత మూల సంస్థానం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం. ద్వైత సిద్ధాంత ఆచరణలో మంత్రాలయం క్షేత్రం జగత్ విఖ్యాతి గాంచింది. మధ్వమత స్థాపకుల అభీష్ట కార్యాచరణ, దేవతామూర్తుల సేవలో గురు పరంపర తరిస్తూ వస్తోంది. మధ్వమత ఆరాధ్యదైవం మూలరాములు. శ్రీమఠం సంస్థాన పూజగా రాములోరి పూజ ఆనవాయితీగా సంక్రమించింది. పీఠం అధిరోహించిన గురువులు శ్రీరామచంద్రమూర్తి సేవలో తరిస్తూ వస్తున్నారు. మూలరాముల ప్రతిమ పురాణం, సంస్థాన పూజ విశిష్టతపై సాక్షి ప్రత్యేక కథనం..



మూల, ద్విగ్విజయ, జయరాముల మూలవిరాట్‌లు

- పీఠం పరంపరగా మూలరామ సంస్థానపు పూజ
- మూలరామ ప్రతిమకు పురాణ చరిత్ర
- పంచమూర్తులకు పీఠాధిపతుల నిత్యసేవ

మంత్రాలయం: విశ్వకర్మ అమృతహస్తాలతో రూపుదిద్దుకున్న మూల రూపమే రామదేవుని ప్రతిమ. సాక్షాత్తు బ్రహ్మదేవుడిచే సదరు ప్రతిమ పూజలందుకున్నట్లు ఇతిహాసంలో ఉంది. దశరథ మహారాజు తరువాత శ్రీరామచంద్రమూర్తి ప్రతిమ సేవలో తరించడంతో ప్రతిమకు మూలరాముడి పేరు ఒనగూరింది. మూల పరంపరలో భాగంగా మధ్వ సంస్థానం ఈ ప్రతిమ సేవ గావిస్తోంది. మధ్వ పీఠం గురు గణం అదే రీతిలోనే నడుచుకుంటోంది. ప్రస్తుత పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాముల పూజలో తరిస్తున్నారు.

పంచమూర్తుల పూజ

☛ ఆదిమూర్తి మూలరాముడితోపాటు మరో నలుగురు దేవతామూర్తుల పూజలు శ్రీమఠంలో సంస్థాన పూజగా వస్తోంది.

☛ రెండవ మూర్తి దిగ్విజయ రామచంద్ర. మధ్వమత స్థాపకులు మధ్వాచార్యులు ఈ ప్రతిమకు పూజలు చేశారు. మూర్తి పాదములందు దశావతారాలు, శిరస్సున, పాదాల చెంత సుదర్శనములు ఉన్నాయి.

☛ మూడవ మూర్తి జయరామచంద్ర. మధ్వమత పరంపర పీఠాధిపతి జయతీర్థులు (టీకాచార్యులు) ఈ ప్రతిమకు పూజలు గావించారు. శ్రీమఠం మూల ఆచారంగా జయరామచంద్రకు పూజలు చేస్తూ వస్తున్నారు.

☛ నాల్గవ మూర్తి సంతాన గోపాలకృష్ణ దేవుడు. రాఘవేంద్రస్వామి అమృత హస్తాలతో ఈ మూర్తి సేవలో తరించారు. కర్ణాటకలోని ఉడిపి క్షేత్రంలో చంద్రికా గ్రంథానికి వ్యాఖ్యాన రచన చేశారు. అందుకు చిహ్నంగా శ్రీకృష్ణుడి బంగారు ప్రతిమను నిర్మించి, పూజించారు. శ్రీకృష్ణుడి ఉపాసనా ఫలముతో సర్వసిద్ధి, సంతాన, భీతి యంత్రములు భక్తులకు వితరణ చేస్తున్నారు. ప్రస్తుత పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తుల కోరిక మేరకు ఈ మూడు యంత్రాలు

☛ ఐదవ మూర్తి నీలాదేవి కరార్పిత వైకుంఠవాసుదేవుడు. శ్రీకృష్ణుడి అష్టమహిషీలతో ఒకరైన వైకుంఠవాసుడిని ఇక్కడ సంస్థాన పూజతో సేవిస్తు



ప్రత్యేకం



సంస్థాన పూజలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

న్నారు. అంతేగాక రాఘవేంద్రస్వామి గురువు సుధీంద్రతీర్థులు పూజించిన లక్ష్మీనారాయణస్వామి, మధ్వాచార్యులకు వేదవ్యాసులు ఒసంగిన వ్యాసముష్టి, సాలగ్రామములకు పూజ లు చేయడం ఆనవాయితీగా వస్తోంది. 2018లో శ్రీ మఠం సంస్కృత విద్యా పీఠం ప్రథమ బ్యాచ్ విద్యార్థులు చంద్రికా మంగళం సందర్భంలో వేణుగోపాలకృష్ణుడి విరాట్‌కు పూజలు చేపట్టారు. అప్పటి నుంచి కొనసాగుతోంది.

సంస్థాన పూజ వేళలు

రాఘవేంద్రస్వామి రోజువారి పూజలు ముగియగానే సంస్థాన పూజ మొదలు పెడతారు. ప్రతిరోజూ శ్రీమఠం పూజా మందిరంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు సంస్థాన పూజ గావిస్తారు. ద్వాదశి రోజున, ధనుర్మాసంలో వేకువజామున 5 గంటల నుంచి 6 గంటల వరకు ఈ పూజ ఉంటుంది. సంస్థాన పూజలో పాల్గొన్న భక్తుల దర్శనార్థం దేవతామూర్తులను ప్రసన్నం చేస్తారు.



> **గురువుల పరంపరగా సంస్థాన పూజ**
>
> మధ్వమత మూల మఠమైన రాఘవేంద్రస్వామి సన్నిధిలో సంస్థాన పూజ గురువుల పరంపరగా వస్తోంది. పూర్వ గురువులు మూల, దిగ్విజయ, జయ రాములు, రాయరు పాదుక, వైకుంఠ వాసుదేవుడు, సంతాన గోపాలకృష్ణుడు సేవలో తరించా రు. ఆనవాయితీగా తాము సంస్థాన పూజలు కాని స్తున్నాం. సంస్థాన పూజలో లక్షలాది మంది భక్త లు పాలుపంచుకుని స్వామి కృపకు పాత్రుల వుతున్నారు. – సుబుధేంద్రతీర్థులు, పీఠాధిపతి

మూల పాదుక పూజ..

వనవాస సమయంలో భరతుడి కోరిక మేరకు శ్రీరాముడు రాజ్యపరిపాలన చేయుటకు పాదుకలను పొందిన పురాణం తెలిసిందే. ఇదే రీతిన రాఘవేంద్రస్వామి బృదావన ప్రవేశం చేయు వేళ శిష్యుడు యోగీంద్రతీర్థులు కోరిక మేరకు పాదుకలను అప్పగిస్తారు. పాదుకలతో సంస్థాన నిర్వహణ నిరాటంకంగా సాగించాలని ఆశీర్వచనం చేశారు. నాటి నుంచి యతులు పాదుకలను పూజిస్తూ వస్తున్నారు. పురాతన పాదుకలు కావడంతో బంగారు ధారణ చేశారు.

మరింత పకడ్బందీగా ఈ–క్రాప్ బుకింగ్

- అధికారులకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదును మరింత పారదర్శకంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సారి జీయో పెన్సింగ్ ద్వారా పంట ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇది వరకు 10 మీటర్ల వరకు మాత్రమే జీయో పెన్సింగ్ ద్వారా పంట ఫొటో తీయాల్సి ఉందని, దీనిని మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. వరిలో 200 మీటర్లు, ఫారెస్ట్ ఏరియాల్లో 150 మీటర్లు, ఇతర పంటల్లో 50 మీటర్ల వ్యవధిలో జీయో పెన్సింగ్ ద్వారా ఫొటో తీయాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(జీఏపీ) పొలంబడి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలో వరిలో జీఏపీ పొలంబడి నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు అవసరమైన రసాయన ఎరువులన్నీ ఉంచాలని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులకు బ్యాంకుల నుంచి రుణాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలు రెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, గిరీష్, ఏఓలు రాఘవేంద్ర, శారద,అల్లీపీర, అనురాధరెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలు త్వరగా పూర్తి చేయాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం
- హౌసింగ్ ఏఈల పనితీరుపై తీవ్ర అసహనం

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు 31లోపు నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు సంబంధించి ఓర్వకల్, పత్తికొండ మండలాల్లో పురోగతి చాలా తక్కువ ఉందని, అవసరమైతే కూలీలను పెంచి పనులు చేయించాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల్లో పురోగతి చూపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణాల విషయంలో హౌసింగ్ ఏఈల తీరుపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పనిచేయకున్నా హౌసింగ్ ఏఈలను పీడీ వెంకట నారాయణ వెనుకేసుకు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీ ప్రభుత్వానికి సరెండర్?

హౌసింగ్ పీడీ వెంకట నారాయణ పనితీరుపై కలెక్టర్ డాక్టర్ జి.సృజన తీవ్ర అసహనంగా ఉన్నారు. ఆయన హౌసింగ్ ఏఈలు పనిచేయకున్నా వెనుకేసుకురావడం, ఇంజినీరింగ్ అసిసెంట్లపై వేగంగా చర్యలు తీసుకోవడంపై టెలీ కాన్ఫరెన్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇటీవల కృష్ణగిరి హౌసింగ్ ఏఈ షేక్షావలి ఇళ్లు నిర్మించకున్నా బిల్లులు పెట్టాలని ఇంజినీరింగ్ అసిసెంట్లపై ఒత్తిడి చేశారు. ఈ అంశంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిని తొలగించేందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ హౌసింగ్ పీడీని ఆదేశించారు.అయితే ఆయన రెండు, మూడు రోజులు గడిచినా ప్రతిపాదనలు పంపలేదు. దీంతో తన ఆదేశాలను పాటించని పీడీని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్
- మైనార్టీల సమస్యలపై కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్

కర్నూలు(సెంట్రల్) : మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మైనార్టీలైన ముస్లింలు, క్రిష్టియన్లు, సిక్కులు, జైనులు, పారసీల నుంచి సమస్యల పరిష్కారం కోసం వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మైనార్టీలు అధిక సంఖ్యలో వచ్చి సమస్యలపై తనకు వినతులు ఇచ్చారన్నారు. ఇచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపేందుకు కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ.. జిల్లాలో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ..మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం కమిషనే ప్రజల దగ్గరకు రావడం సంతోషకరమన్నారు. నంద్యాల రైతు నగరంలో 70 ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూశామని, ఆ భూములకు ప్రత్యేకంగా కంచె వేయించాలని జిల్లా అధికారులను కోరారు. నంద్యాలలో మూడు, కొలూరులో మరో మసీదుకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ..మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం కమిషన్ మొట్ట మొదటి సమావేశాన్ని కర్నూలులో నిర్వహించడం సంతోషకరమన్నారు. కర్నూలు, కల్లూరు మండలాల్లో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ మెంబర్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహారుడు డి. హబీబుల్లా, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, కర్నూలు రూరల్, కల్లూరు తహసీల్దార్లు శివరాముడు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

37 వినతుల స్వీకరణ...

రాష్ట్ర మైనార్టీ కమిషన్ నిర్వహించిన స్పందనలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి 37 మంది తమవినతులను సమర్పించారు. అందులో కొన్ని...

➡ జిల్లాల్లో ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన 15 సూత్రాల పథకానికి సంబంధించిన సమావేశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విశ్రాంత తహశీల్దార్ రోషన్ అలీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చారు.

➡ కర్నూలు నగరంలోని జొహరపురం జర్నలిస్టు కాలనీలో సీనియర్ ముస్లిం జర్నలిస్టు స్థలాన్ని కొందరు కబ్జా చేశారని, న్యాయం చేయాలని చైర్మన్‌ను కలిసి కొందరు కోరారు.

➡ క్రిష్టియన్ మైనార్టీలకు సంబంధించి కొందరు బీసీ–సీ జాబితాలో ఉన్నారని, వీరికి ఆ కోటాలో రిజర్వేషన్ కల్పించాలని, అలాగే కర్నూలులో క్రిష్టియన్ భవనాన్ని ఏర్పాటు చేయాలని క్రిష్టియన్ నాయకులు రాజు,జాన్ వినతిపత్రం ఇచ్చారు.

స్పందన ఫిర్యాదుల స్టేటస్ తెలుసుకోండి

బొమ్మలసత్రం: పోలీసు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుల సమాచారం గురించి తెలుసుకునేందుకు 9154987034కు కాల్ చేయాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్పందన ఫిర్యాదుల వివరాలు, సెంట్రల్ కంప్లయింట్ సెల్ గురించిన వివరాలు, శాంతిభద్రతలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడిన బాధితులు నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

24న ఉచిత హోమియో వైద్య శిబిరం

నంద్యాల(టౌన్): కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామంలోని కాశినాయన గాయత్రి ఆలయ ప్రాంగణంలో ఈనెల 24వ తేదీ గురువారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డీహెచ్‌ఎంఎస్ డాక్టర్ సురేంద్రరాజు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ అంబటి సురేంద్రరాజు ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందని, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. వైరల్, బ్యాక్టీరియల్, ఫంగల్ వ్యాధులు గత మూడేళ్లుగా ప్రబలుతున్న నేపథ్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

హంద్రీనీవా నుంచి నీటివిడుదల పెంపు



ఐదు పంపుల ద్వారా విడుదలవుతున్న నీరు

నందికొట్కూరు రూరల్: మల్యాల హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలను పెంచినట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి 5 పంపుల ద్వారా 1,650 క్యూసెక్కుల నీటిని హంద్రీనీవాకు, రెండు పంపుల ద్వారా 675 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. హంద్రీనీవా నుంచి కేసీకి నీటిని విడుదల చేస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆగస్టు నెలలో వర్షాలు లేక వరి నాట్లు వేయక ఆందోళన చెందుతున్న సమయంలో కేసీ నీరు విడుదల కావడంతో రైతులు ఊరట చెందుతున్నారు. కేసీ ఆయకట్టులో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కేసీకి సమృద్ధిగా నీరు విడుదలవుతే ఖరీఫ్ గట్టెక్కనుంది.

అప్పు చెల్లించలేకనే హత్యాయత్నం

ఓర్వకల్లు: అప్పు చెల్లించలేక ఈనెల 18న మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను మంగళవారం ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. కర్నూలు నగరంలోని బి.క్యాంపుకు చెందిన గిరిపోగు ఇమ్మానుయేలు కొడుకు గిరిపోగు క్రాంతి స్వరూప్(35) అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కరోనా సమయంలో డ్రైవర్ వృత్తిని మానేసి, కార్ల వ్యాపారం చేసేవాడు. ఆ సమయంలో నన్నూరు సమీపంలోని రాగమయూరి కాలనీ ప్యారడైజ్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న షేక్. గౌసియాభాను(28) అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె వద్ద రెండేళ్ల క్రితం రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సదరు డబ్బులను తిరిగి చెల్లించే విషయంలో ఆమెతో తరచుగా గొడవపడేవాడు. ఈ క్రమంలో ఎలాగైనా గౌసియాను అంతమొందించాలని పథకం రచించి ఈ నెల 18వ తేదీన రాగమయూరి వద్దకు రప్పించుకుని కత్తితో వీపుపై బలంగా పొడిచి, ముఖంపై బండరాయితో మోదాడు. స్థానికులు గమనించి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రాంతి స్వరూప్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా అప్పు చెల్లించలేకే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు అంగీకరించాడు. ఈనేపథ్యంలో నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి, పోలీసులు విజయభాస్కర్, మధుసూదన్ పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

అతివేగానికి రెండు ప్రాణాలు బలి

- బైక్ అదుపు తప్పి ఇద్దరు దుర్మరణం
- మృతుల్లో కోసిగి స్టేషన్ కానిస్టేబుల్
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

మంత్రాలయం రూరల్: అతివేగం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మంత్రాలయం సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోసిగి పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ కురవ రాఘవేంద్ర (35), మాధవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయ గోవిందు (25) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన కురవ చిన్న లింగన్న కుమారుడు కురవ రాఘవేంద్ర (పీసీ నెంబరు 3090, 2013బ్యాచ్) కోసిగి మండల పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. రాఘవేంద్ర సొంత పనిమీద మంగళవారం సాయంత్రం బైక్‌పై మాధవరం వెళ్లారు. ఆ తర్వాత స్వగ్రామానికి తిరిగి వస్తుండగా బోయ గోవింద్ లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కాడు. మార్గమధ్యలో మంత్రాలయానికి కిలోమీటరు దూరంలో గోశాల క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. ఎగిరి పడిన ఇద్దరూ రోడ్డుపై బలంగా పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వాహనం అతివేగంగా వెళ్తూ వేగాన్ని నియంత్రించుకోలేక క్రాస్‌లో తిప్పే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తోంది. హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్ర గాయమై ప్రాణాలు కోల్పోయారు. మృతుడు కానిస్టేబుల్‌కు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మాధవరం గ్రామానికి చెందిన బి.శంకరప్ప కుమారుడు బోయ గోవిందు ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఇటీవలనే వివాహమైంది. మాధవరం నుంచి మంత్రాలయానికి వెళ్లేందుకు కానిస్టేబుల్ బైక్‌పై లిఫ్టు అడిగి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. అదే సమయంలో కోసిగి మండలానికి వెళ్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ప్రమాదంలో స్థలంలో నిలిచి ఎస్ఐ వేణుగోపాల్‌తో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాద స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ సృజన



మృతులు కానిస్టేబుల్ రాఘవేంద్ర, గోవిందు (ఫైల్)

క్లుప్తంగా

చంద్రయాన్-3 నమూనా ప్రదర్శన



చంద్రయాన్-3 నమూనా ప్రదర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కర్నూలు సిటీ: స్థానిక ఏక్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో మంగళవారం చంద్రయాన్-3 నమూనాను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం రమాజ్యోతి మాట్లాడుతూ.. ప్రపంచమంతా ఉద్వేగంతో ఎదురుచూస్తున్న చంద్రయాన్-3 బుధవారం చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అవుతుందన్నారు. ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా నమూనా ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

ఎనిమిది మంది డిబార్

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు, బీఈడీ పరీక్షల్లో ఒకరు డిబారైనట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 6,063 మందికి గాను 5,402 మంది విద్యార్థులు హాజరయ్యారని, మిగతా 661 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అలాగే బీఈడీ పరీక్షలకు 2,212 మందికిగానూ 2,084 మంది విద్యార్థులు హాజరవ్వగా 128 మంది గైర్హాజరయ్యారని వివరించారు. శ్రీ శంకరాస్ డిగ్రీ కాలేజీ (కర్నూలు)-3, ఆర్‌సీ రెడ్డి డిగ్రీ కాలేజీ (కర్నూలు)-2, సాయి డిగ్రీ కళాశాల (ఆదోని), కీర్తన డిగ్రీ కళాశాల (నంద్యాల)లో ఒక్కొక్కరు, బీఈడీ పరీక్షల్లో ఎస్ఎంఎల్ డిగ్రీ కాలేజీ (ఎమ్మిగనూరు)లో ఒకరు చొప్పున విద్యార్థులు డిబారైనట్లు పేర్కొన్నారు. అలాగే సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బీపీఈడీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వీసీ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ నాగభూషణం విద్యార్థులకు సూచించారు. కప్పల్‌నగర్‌లోని చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం కార్యక్రమానికి హాజరయ్యారు. లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనాలు నడపరాదని, తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేయడమే కాక వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సిబ్బందితో పాటు పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

6న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీ ఉదయం 10 గంటలకు వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పూజ, సాయంత్రం చిన్నారులచే నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ, రాధా గోపికా వేషధారణ పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల వారు మిషన్ కేంద్రంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

24న వెంకయ్య స్వామి ఆరాధన

కర్నూలు కల్చరల్: స్థానిక దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 24వ తేదీ ఉదయం 7 గంటలకు నవ దత్త స్వరూపాలలో ఒకరైన భగవాన్ గొలగముడి వెంకయ్య స్వామి 41వ పుణ్యతిథిని పురస్కరించుకొని స్వామి ఆరాధన నిర్వహించనున్నట్లు సాయిబాబా భక్త మండలి కార్యదర్శి మహాబలేష్ పేర్కొన్నారు. రాత్రి పల్లకీ సేవ, సాయి భక్తులు, సాయి దీక్షాపుల సత్సంగం జరుగుతాయని తెలిపారు. భక్తులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

76 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాటిళ్లను చూపిస్తున్న ఎస్‌ఐ నల్లప్ప

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 76 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీ చేపట్టగా ఎరుకల నరసింహులు ఇంటి ముందు ఎలాంటి అనుమతులు లేని 76 క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు. పోలీసులను చూసి నిందితుడు పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

క్యూఆర్ కోడ్‌తో ఓపీ టికెట్

పెద్దాసుపత్రిలో ప్రారంభమైన డిజిటల్ సేవలు

- స్మార్ట్ ఫోన్ ద్వారా ప్రతిరోజు 600 నుంచి 800 వరకు ఓపీ రిజిస్ట్రేషన్
- అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, నర్సులు
- ఆసుపత్రిలో సేవలన్నీ ఆన్‌లైన్ దిశగా అడుగులు
- ఇకపై రోగి మెడికల్ రికార్డులన్నీ ఆన్‌లైన్

➤ఆదోనికి చెందిన రామయ్య పెద్దాసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నాడు. వైద్యులు గతంలో చికిత్స చేయించుకున్న చీటీలు తీసుకురావాలని చెప్పారు. అవి ఎక్కడో పోయాయని రామయ్య సమాధానమిచ్చాడు. దీంతో వైద్యులు అతనికి అప్పటి వరకు ఉన్న వైద్య నివేదికల ఆధారంగా మాత్రమే చికిత్స చేసి పంపించారు.

➤కౌతాళంకు చెందిన ఉరుకుందప్ప కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చాడు. వైద్యులు పరీక్షించి కాలేయం సమస్య ఉందని చెప్పారు. తాను గతంలో కూడా వచ్చి చికిత్స చేయించుకున్నానని చెప్పడంతో రిపోర్టులు అడిగారు. అయితే అవి ఇంటి వద్దే ఉన్నాయనడంతో అప్పటి సమాచారం మేరకు చికిత్స చేశారు.

➤.. రోగులకు గతంలో చికిత్స తీసుకున్న వివరాలు తెలియకపోతే వైద్యులు ఆ రోజు పరిస్థితికి అనుగుణంగా మాత్రమే చికిత్స చేస్తారు. అదే పాత రిపోర్టులు ఉంటే గతంలో ఇచ్చిన మందులను మార్చాలా. లేక కొనసాగించాలా? అనే విషయాలను నిర్ధారించుకొని మెరుగైన వైద్యం అందించే వీలుంటుంది. ఈ విషయంలో రోగులకు, వైద్యులకు ఉపయోగకరంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ-హాస్పిటల్ విధానం అమలులోకి తీసుకొచ్చింది.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు జిల్లా నుంచే కాకుండా నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, రాయచోటి, ప్రకాశం జిల్లాల.. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ప్రతిరోజూ 2వేల నుంచి 2,500 వరకు ఓపీ ఉంటోంది. ఇన్‌పేషంట్లుగా 1500 పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. 38 దాకా విభాగాలున్న ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం ప్రతిచోటా చికిత్స కాగితాలపైనే కొనసాగుతోంది. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగి అన్ని విభాగాలకు సంబంధించిన రిపోర్ట్స్, చికిత్సకు సంబంధించిన కాగితాలను సంవత్సరాల తరబడి భద్రపరచుకోవడం కూడా ఇబ్బందిగానే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-హాస్పిటల్ రోగులకు ఎంతో ఉపయోగపడుతుంది.

స్పెషాలిటి ఓపీ విభాగాల్లో ఈ-హాస్పిటల్

ప్రస్తుతం ఆసుపత్రిలోని స్పెషాలిటీ విభాగాలైన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, సైకియాట్రి, డెంటల్, గ్యాస్ట్రో ఎంట్రాలజి, గైనకాలజి విభాగాల్లోని ఓపీ సేవల వద్ద, మైక్రోబయాలజి, పెథాలజి, బయోకెమిస్ట్రీ ల్యాబోరేటరీల్లో ఈ-హాస్పిటల్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఇందుకోసం ఆయా విభాగాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి నెట్ కనెక్షన్ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ఓపీ టికెట్ తీసుకున్న రోగి వివరాలు చెప్పగానే ఓపీలో రోగి వ్యాధి లక్షణాలను ఎంటర్ చేస్తారు. అనంతరం అవసరమైన పరీక్షల కోసం ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదవుతాయి. ఆ మేరకు మళ్లీ సదరు ల్యాబ్ వద్దకు వెళ్లి మొబైల్‌లో అభా నెంబర్ చెబితే చాలు. అక్కడ కంప్యూటర్‌లో రోగి వివరాలు చూసి పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం రిపోర్ట్స్ కూడా ఓపీలో ఉన్న వైద్యునికి ఆన్‌లైన్‌లోనే వెళ్తాయి. అందులోని రిపోర్ట్స్ ఆధారంగా రోగికి వైద్యులు చికిత్సను అందిస్తారు. మందులు సైతం ఆన్‌లైన్‌లో ఫార్మసికి చేరుతాయి. అక్కడ రోగికి ఫార్మాసిస్టు మందులు ఇచ్చి పంపుతారు. రోగి మరోసారి ఎప్పుడైనా ఆసుపత్రికి వచ్చినప్పుడు అభా నెంబర్ చెబితే చాలు అందులోని వివరాల ఆధారంగా మెరుగైన వైద్యం అందించేందుకు ఈ విధానం దోహదపడుతోంది.



ఓపీ టికెట్ ఇస్తున్న కంప్యూటర్ ఆపరేటర్



ఓపీ టికెట్ తీసుకుంటున్న రోగులు

త్వరలో అన్ని విభాగాల్లో ఈ-హాస్పిటల్



ప్రస్తుతం ఏడు విభాగాల్లో ఈ-హాస్పిటల్ సేవలను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. వారం, పదిరోజుల్లో ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో ఈ-హాస్పిటల్ సేవలను ప్రారంభించబోతున్నాం. ఓపీ సేవలు పూర్తయ్యాక ఇన్ పేషంట్ సేవలను సైతం ఆన్‌లైన్ చేస్తాం. ఒక్కసారి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైతే భవిష్యత్‌లో దేశంలో ఎక్కడికి వెళ్లినా ఆ వివరాల ఆధారంగానే చికిత్స అందుకునే సౌలభ్యం రాబోతోంది.

– డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

ఓపీ రిజిస్ట్రేషన్ ఇలా..



ఓపీ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్

ఆసుపత్రికి వచ్చిన రోగి ముందుగా ఓపీ టికెట్ కౌంటర్ వద్ద ఎక్కువసేపు క్యూలైన్‌లో నిలబడకుండా ప్రత్యేక ఓపీ రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేశారు. ముందుగా రోగి తన స్మార్ట్‌ఫోన్‌లో అభా యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం అందులో తన మొబైల్ నెంబర్‌తో లాగిన్ కావాలి. అప్పుడు అందులో వారి వివరాలతో అభా నెంబర్ క్రియేట్ అవుతుంది. ఇప్పుడు స్కాన్ అండ్ షేర్ విధానంలో రోగి తన మొబైల్ నుంచి కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు. వెంటనే వివరాలన్నీ ఓపీ టికెట్ కౌంటర్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద కంప్యూటర్‌లో ప్రత్యక్షమవుతాయి. ఆపరేటర్‌కు మొబైల్‌లో వచ్చిన ఓపీ టోకెన్ నెంబర్, ఏ విభాగానికి వెళ్లాలనే విషయం చెబితే చాలు వెంటనే ఓపీ టికెట్ ఇచ్చేస్తారు. దీనివల్ల ఓపీ రిజిస్ట్రేషన్‌కు సమయం ఆదా అవడంతో పాటు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ విధానంలో ప్రతిరోజూ 600 నుంచి 800 వరకు ఓపీ టికెట్లు ఇచ్చి చికిత్స చేస్తున్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు



అజీముద్దిన్ నగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- 45వ వార్డులో అపూర్వ ఆదరణ

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నవరత్నాల పథకాలతో పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నింపారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అజీముద్దిన్ నగర్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల బతుకులు మార్చేందుకు తెచ్చిన నవరత్నాల్లో అన్ని పథకాలు ఇమిడి ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు ప్రభుదాస్, షేక్ ఇర్ఫాన్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, షేక్ ఖాదర్ బాషా, సాధిక్, జోషిరాజ్, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

కర్నూలు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ శాఖ రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీలతను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ ప్రతినిధి బృందం మంగళవారం కర్నూలులోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సభ్యులు వెంకటరాముడు, జగన్నాథం, సాయిబాబా, రంగయ్య తదితరులు డిప్యూటీ కమిషనర్‌కు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జోనల్ సీనియారిటీని పూర్తి చేయాలని ప్రతినిధి బృందం కోరగా నాలుగు జిల్లాల్లోని ఈఎస్‌లతో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.



ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన అసోసియేషన్ ప్రతినిధి బృందం

అంతరాయం వస్తే వెంటనే స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి పరిష్కరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింద స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక, ఇతర కారణాలతో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని, ఇలాంటి సమస్యలు దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చూపాలన్నారు. దీనిపై పదేపదే చెప్పించుకోరాదని, ఉద్యోగులు, సిబ్బంది పనిచేసే చోట ఉంటేనే సమస్యలు తెలుస్తాయన్నారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంటి సమస్యలపై జాగ్రత్తగా ఉండాలి



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ పి.సుధాకర్‌రావు

కర్నూలు(అర్బన్): ప్రతి ఒక్కరూ కంటి సమస్యలపై జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ పి.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక బీ క్యాంప్‌లోని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినులు, సిబ్బందికి సుశీల నేత్రాలయ సౌజన్యంతో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. లీగల్ సెల్ అథారిటీ జెడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మిగుర్రప్ప, వసతి గృహ సంక్షేమాధికారిణి సుప్రజ హాజరయ్యారు. విద్యార్థినులు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. జెడ్జీ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, మంచి ప్రణాళికతో ఉద్యోగాలు సాధించాలన్నారు. ఇలాంటి మెడికల్ క్యాంపులను తరచు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలను తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. విద్యా సంస్థల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలకు 1985-86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం క్రీడా పరికరాలను వితరణ చేశారు. హాకీ స్టిక్కులు, ఫుట్‌బాల్ వంటి క్రీడా వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు రఘు, రమేష్, ఉమామహేశ్వర రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూలులో చదివే విద్యార్థులు పాఠశాల క్రీడా పోటీల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు. చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తున్న విద్యార్థులకు తమ వంతుగా క్రీడా పరికరాలను అందజేసినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్, ఉపాధ్యాయులు భాస్కర్, రామశాస్త్రి, సురేష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా పరికరాలు వితరణ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పాతబస్తీలో చోరీ

కర్నూలు: కర్నూలు పాతబస్తీ చిత్తారి వీధిలో నివాసముంటున్న షేక్ అజీజ్ బాషా ఇంట్లో దొంగలు పడి అందినకాడికి మూటగట్టుకుని ఉడాయించారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈయన నివాసముంది. అజీజ్ బాషా ఆరోగ్యం బాగలేకపోవడంతో ఈనెల 17వ తేదీ ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ప్రధాన ద్వారానికి ఉన్న తాళాలు పగులగొట్టి పడక గదిలోకి వెళ్లి బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం రాత్రి అజీజ్ బాషా ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండటంతో గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని అజీజ్ బాషా భార్య షబానా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు.

నేరచరితులకు పోలీస్ కౌన్సెలింగ్

కర్నూలు: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దందాలు, రౌడీయిజం, అల్లర్లకు పాల్పడే వారి జాబితాను స్టేషన్ల వారీగా సిద్ధం చేసి కర్నూలు శివారులోని జగన్నాథ గట్టుపై ఉన్న పోలీసు శిక్షణా కేంద్రంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గతంలో నేర చరిత్ర ఉన్నవారిని దాదాపు వంద మందికి పైగా డీటీసీకి రప్పించి తీవ్రస్థాయిలో హెచ్చరించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. నేర చరిత్రకు స్వస్తి చెప్పి గౌరవప్రదమైన జీవితం గడపాలని హెచ్చరించినట్లు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధానంగా ట్రబుల్ మాంగర్స్ కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.

ఎన్ఐఏ విచారణకు భయపడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న షేక్ అబ్దుల్లా

కర్నూలు: కర్నూలు పాతబస్తీ చిత్తారి వీధిలో నివాసముంటున్న షేక్ అబ్దుల్లా (42) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. భార్య షేక్ రఫియాతో పాటు ముగ్గురు కుమారులు సంతానం. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయన కొంతకాలంగా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థలో పనిచేసేవాడు. ఈనెల 10వ తేదీన కర్నూలులో ఎన్ఐఏ అధికారులు ఈయన ఇంట్లో కూడా సోదాలు నిర్వహించి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న పోలీసు అతిథి గృహానికి పిలిపించి విచారించి వదిలేశారు. 22వ తేదీ మళ్లీ విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు ఇచ్చారు. మంగళవారం ఎన్ఐఏ అధికారుల ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ విషయంపై కర్నూలు ఒకటవ పట్టణ సీఐ నాగశేఖర్‌ను వివరణ కోరగా.. ఎన్ఐఏ అధికారులు ఇచ్చిన నోటీసుకు భయపడే తన భర్త షేక్ అబ్దుల్లా ఆత్మహత్య చేసుకున్నట్లు రాతపూర్వకంగా ఫిర్యాదు అందిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని గణేష్ నగర్ ఏరియాలో చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గణేష్ నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, పార్థసారథీ టవర్స్, శ్రీవారి కుటీర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు పి.బషీర్ ఖాన్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, ఎరుకల రాజు, రమేష్‌బాబు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, అనిల్‌బాషా పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తనపై 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి విచారణ జరిపారు. ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విచారణలో బయటపడిందని కమిటీ సభ్యులు వెల్లడించారు. గత వారం ఉపాధ్యాయుడిపై అసభ్య ప్రవర్తనపై తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని వాగ్వాదానికి దిగిన విషయం తెలుసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వారు స్పష్టం చేశారు.

తగిన చర్యలు తీసుకుంటాం

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన గురించి నా దృష్టికి వచ్చింది. నోటీసులు జారీ చేయాలని ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరికి ఆదేశాలు జారీ చేశాం. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకుంటాం.

– హనుమంతరావు, డిప్యూటీ డీఈఓ

అర్హులందరికీ పథకాలు అందించండి

కర్నూలు (న్యూటౌన్): అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం సాయంత్రం జెడ్పీ కార్యాలయంలో కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్‌తో కలిసి వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ.. జగనన్న అమ్మ ఒడి, నేతన్న నేస్తం, వాహనమిత్ర, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే తప్పులు లేకుండా చేపట్టి 5 నుంచి 18 సంవత్సరాల పిల్లలను బడిలో చేర్పించాలని చెప్పారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు స్కూల్, హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి కన్సిస్టెంట్ రితం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే జగనన్న అమ్మ ఒడి ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం వచ్చిన అర్జీలను విచారించాలని, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: బడి ఈడు పిల్లలను బడికి పంపకుండా పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం అని జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పలు ఫ్యాక్టరీలు, ఇటుకల బట్టీలు, స్టోన్ క్రషింగ్ పరిశ్రమలలో ప్రత్యేక అధికారుల బృందం తనిఖీలు చేపట్టి బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో సాంబశివరావు మాట్లాడుతూ.. తల్లితండ్రులు, కార్మికులు, పరిశ్రమల యజమానులు పిల్లలకు బంగారు భవిష్యత్ అందించాలని సూచించారు. బడి ఈడు పిల్లలను బడికి పంపకుండా పనులకు పంపితే ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులను తొలగించే అవకాశం ఉందన్నారు. షాపులు, పరిశ్రమల వద్ద యజమానులు కచ్చితంగా పిల్లలను పనిలో చేర్చుకోబోమని స్టిక్కర్లు అతికించాలని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలని కోరారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు మధుసూధాకర్, జిల్లా పరిశ్రమల అసిస్టెంట్ తనిఖీ అధికారి బీవీ రాజేష్‌రెడ్డి, లేబర్ అధికారులు కేశన్న, శ్రీలక్ష్మి, హేమాద్రి, రాంప్రసాద్, జాతీయ బాలకార్మిక నిర్మూలన సంస్థ అధికారి రంగారెడ్డి, చైల్డ్ హెల్ప్‌లైన్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ సుంకన్న, నరసింహరాజు, బీబీఏ సంస్థ జిల్లా ప్రతినిధి వెంకట తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని వందలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాల అభిషేకం, కుంకుమార్చన, పట్టువస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని పెళ్లి పత్రికను అమ్మవారి పాదాల వద్ద ఉంచి శుభకార్యాలు బంధుమిత్రులతో కలిసి సుఖసంతోషాలతో జరుపుకునేలా దీవించాలని మొక్కుకున్నారు. మరికొందరు ఉద్యోగ ప్రాప్తి, సంతాన ప్రాప్తి ప్రసాదించాలని, నూతన వధూవరులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సెప్టెంబర్ 1న జిల్లాలో బస్సుయాత్ర

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 17వ తేదీన ప్రారంభమైన బస్సుయాత్ర సెప్టెంబర్ 1వ తేదీన కర్నూలుకు చేరుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య తెలిపారు. ఆ రోజు సాయంత్రం కర్నూలులో బహిరంగ సభ ఉంటుందని భారీ ఎత్తున జన సమీకరణ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో కర్నూలు నగర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటో తేదీన కర్నూలులో, రెండో తేదీన ఆలూరు, పత్తికొండలో సీపీఐ బస్సుయాత్ర ఉంటుందన్నారు. ఆయా సభలకు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రాన్ని కాపాడుకుందాం-దేశాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో చేపట్టిన ఈ బస్సుయాత్ర సెప్టెంబర్ 8వ తేదీన తిరుపతిలో ముగుస్తుందని ఆయన వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు మునెప్ప, ఎస్ఎన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

• సృజన

హ్యాపీ స్పేస్



• భార్గవి

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, పైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్ తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



• ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...



• నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రైన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి

ఫొటో: మోహనాచారి

• న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత 'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం



• మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్ళలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్లు ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లలోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్గ్ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వి మేళా, అక్షయ్‌కల్ప్ రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు

సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...



యూత్ పల్స్

ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారి పోటర్' సిరీస్‌లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్ట్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రైటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక దేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్ బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్‌– జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్ట్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

